క్లుప్తంగా

అమ్మ వాసు, మధుకు టూరిజం అవార్డులు



అవార్డులు అందుకుంటున్న అమ్మవాసు, మధు

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన అమ్మ ట్రావెల్స్ అధినేత పి.శ్రీనివాసరావు (అమ్మ వాసు), గోదావరి విహారి టూరిజం అధినేత బుద్దరాజు మధుకు బెస్ట్ టూర్ ఆపరేటర్ (బోటింగ్) ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి శిల్పారామం వేదికపై జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకాభివృద్ధికి తోడ్పడిన పలువురికి ఈ అవార్డులు అందజేశారు. వారికి మంత్రి ఆర్కే రోజా అవార్డులు ప్రదానం చేశారు. వీరిని పలువురు ఏసీ లగ్జరీ బోటు యజమానులు, బోట్ ఆపరేటర్లు అభినందించారు.

పీడీఎస్‌యూ ధర్నా

కంబాలచెరువు: స్థానిక విమెన్స్ కళాశాల జంక్షన్‌లో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మట్లాడుతూ విద్యారంగాన్ని ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని భాగ్యనగర్‌లో మద్యం విక్రయిస్తున్న తాడాల సూర్యనారాయణను గురువారం అరెస్టు చేశారు. అతడి నుంచి ఆరు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా సుధాకర్

ప్రకాశం నగర్: జిల్లా కాపు సేన సంక్షేమ సంఘం కార్యదర్శిగా ఆసూరి సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు గున్నం శ్యాంసుందర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఆయనకు సంఘం కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

నక్కా శ్రీనగేష్‌కు జాషువా పురస్కారం



జాషువా పురస్కారం అందుకుంటున్న నక్కా శ్రీనగేష్

ప్రకాశం నగర్: వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ జాషువా సాహితీ పురస్కారం అందుకున్నారు. జాషువా జయంతి సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏలూరులో గురువారం జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా, నన్నయ ప్రొఫెసర్ పువ్వుల ఆనంద్, వూటుకూరి వరప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీవి నీచ రాజకీయాలు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు ముఖ్యమంత్రి జగన్‌ను వాడుకుంటూ బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. ఆయన రాజమహేంద్రవరంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో అనేక సమస్యలు మరుగున పడిపోయాయన్నారు. పవన్ కల్యాణ్ సెంట్రల్ జైల్ వద్ద ఆ రోజు మాట్లాడటం తప్ప, మళ్లీ నోరు విప్పలేదన్నారు. చంద్రబాబు విషయంలో పురందేశ్వరి సైతం మాట్లాడడం లేదన్నారు. 2024 ఎన్నికల్లో అమలాపురం ఎంపీ గానే పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

క్యాన్సర్‌పై సదస్సు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో సైన్స్ అసోసియేషన్ నేతృత్వంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డెల్టా ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ సుమంత్ హాజరై వివిధ రకాల క్యాన్సర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

సినిమాలు

శ్యామల	:	చంద్రముఖి-2
సూర్యమినీ	:	పెదకాపు-1
సూర్యప్యాలెస్	:	చంద్రముఖి-2
స్వామి	:	స్కంద
శివజ్యోతి	:	మిస్‌శెట్టి మిస్టర్‌పోలిశెట్టి
అనుశ్రీ	:	పెదకాపు-1
రాజా	:	స్కంద
అశోక	:	చంద్రముఖి-2
ఊర్వశి	:	స్కంద
రంభ	:	చంద్రముఖి-2
మేనక	:	సప్తసాగరాలు దాటి
అప్సర	:	స్కంద
నామవరం		
వీఎస్ మహల్	:	చంద్రముఖి-2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	చంద్రముఖి-2
కడియం		
వెంకటసూర్య	:	పెదకాపు-1

బైబై గణేశా..



ధవళేశ్వరం రామపాదాలరేవుకు ఊరేగింపుగా వస్తున్న గణపతి

- గోదావరిలో విగ్రహాల నిమజ్జనం
- భక్తిశ్రద్ధలతో కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: గణపతి విగ్రహాల నిమజ్జనాలు గురువారం ఘనంగా జరిగాయి. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి విగ్రహాలను హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలోని పూర్వపు ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ నగర పాలక సంస్థ అధికారులు చేశారు. 24 గంటలు విధులూ నిర్వహించేలా మూడు షిఫ్టుల్లో సిబ్బందిని కేటాయించారు. నదిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక పంటు, లాంచీలను, విగ్రహాలను పంటుపైకి ఎక్కించేందుకు ప్రత్యేక భారీ క్రేన్‌ను సిద్ధం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వచ్చిన అన్ని విగ్రహాలనూ పూర్తిస్థాయిలో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు.

ధవళేశ్వరం: ధవళేశ్వరంతో పాటు పరిసర గ్రామాల నుంచి గణనాథుని విగ్రహాలను భారీ ఊరేగింపులతో రామపాదాలరేవు వద్దకు తీసుకువచ్చి గోదావరిలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కంబాలచెరువు: గోదావరిలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు.



రాజమహేంద్రవరంలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



గోదారమ్మ ఒడికి చేరిన గణపతి



విగ్రహాలను తీసుకువస్తున్న మార్వాడీలు



నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్



చిన్న విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

ఘనంగా ముస్లింల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకుని గురువారం ముస్లింలు శాంతిర్యాలీ నిర్వహించారు. స్థానిక జాంపేట ఆజాద్ చౌక్ సెంటర్‌లో ఈ ర్యాలీని ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ప్రారంభించారు. ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ పుట్టిన రోజు సందర్భంగా ముస్లిం సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు ఆదర్శమూర్తి ప్రవక్త మహమ్మద్ కృషి చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ ఇతర మతాలను సహనంతో గౌరవించే వాడే అసలైన నిజమైన భారతీయ ముస్లీములన్నారు. ఈ ర్యాలీ ఆజాద్ చౌక్ నుంచి ప్రారంభమై నగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించి దానవాయిపేట మసీదుకు చేరుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షులు హబీబుల్లాఖాన్, షరీఫ్, తస్లీమ్ ఖాన్, ఆసిఫ్ ఖాన్, అరిపుల్లా ఖాన్, బాషా, లాయర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ భరత్‌రామ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్‌కు నగరంలో పౌరసన్మానం జరిగి 79 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల బాబాసాహెబ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే గుర్రం జాషువా జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ విద్య పదునైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ అక్షరాస్యులైనప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహం చెంతనే ఒక గ్రంథాలయం నిర్మించాలని ఎప్పటినుంచో కోరుతున్నారని, వచ్చే అంబేద్కర్ జయంతి నాటికి ఆ కార్యక్రమం తప్పనిసరిగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటీష్ కౌన్సిల్ సభ్యుడిగా అంబేద్కర్‌ను ప్రకటించిన తరువాత ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా 1944లో ఇదే రోజు రాజమహేంద్రవరంలో ఆయన నడిచారన్నారు. గోరక్షణపేటలో జరిగిన బహిరంగ సభలో జాతిని జాగృతం చేసి చైతన్య పరిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

అన్నసమారాధన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 23వ డివిజన్ నందివాడ వారి వీధిలో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వాకచర్ల కృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద గురువారం మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సంకిస భవానీ ప్రియ, అడపా శ్రీహరి, పోలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ బహూకరణ



ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందిస్తున్న ప్రసాదరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)ను స్థాపించి 67 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ రాజమహేంద్రవరం సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు గురువారం గౌతమీ జీవకారుణ్య సంఘానికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ బహూకరించారు. ప్రసాదరావు, మార్కెటింగ్ మేనేజర్ బీవీ కళ్యాణ్, సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మికి అందించారు. ప్రసాదరావు మాట్లాడుతూ వృద్ధులు, చిన్న పిల్లలకు శ్వాస సమస్యలు ఎదురైనప్పుడు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు సమ్మతం గన్నయ్య, ఏకే విశ్వనాథ్, పి.ఆనంద్ కుమార్, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

రైతునేస్తం పథకాన్ని వినియోగించుకోవాలి



మహాజన సభ సమావేశంలో మాట్లాడుతున్న గిరజాల వీర్రాజు

కడియం: రైతునేస్తం అనే కొత్త పథకం ద్వారా సభ్యులకు ఎకరానికి రూ.8 లక్షలు రుణంగా ఇస్తామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కడియం విశాల సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ గిరిజాల వీర్రాజు(బాబు) కోరారు. ఆయన అధ్యక్షతన గురువారం ది కడియం విశాల సహకార పరపతి సంఘం మహాజనసభ జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 31 వరకూ జరిగిన పాలకవర్గ సమావేశం తీర్మానాలు, జమా ఖర్చులు, 2022-23 ఆడిట్ రిపోర్ట్‌ను ఆమోదించి తీర్మానం చేశారు. సంఘ అధ్యక్షుడు గిరజాల బాబు మాట్లాడుతూ సంఘానికి బకాయిపడిన అన్ని రకాల అప్పులు చెల్లించి, సంఘం ఎన్‌పీఏ తగ్గించాలని సభ్యులకు సూచించారు. ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతుల కోరిన అప్పులు త్వరితగతిన మంజూరు చేయుటకు సంఘ సీఈవోను శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కడియం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డా బుజ్జి, కడియం సొసైటీ అడ్వైజర్ కమిటీ సభ్యులు పడాల గోవిందు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సర్కార్ బాషా, సంఘ పర్సన్లు పంపన గోవిందు, వర్సాల వీర్రాజు, భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ రావిపాటి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

'ఒడి' లఘు చిత్రబృందానికి అభినందన



చిత్రబృందాన్ని అభినందిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర

రాజమహేంద్రవరం రూరల్: ఒడి లఘు చిత్ర బృందానికి ఆర్కెస్ట్రా పితామహుడు, నటగాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర గురువారం అభినందనలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి మూవీస్ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు చెందిన దర్శకుడు పిచ్చుక మహేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. విజయవాడ తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ నిర్వహించిన లఘు చిత్రాల పోటీల్లో ప్రత్యేక జ్యూరీ విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికై పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేష్, నిర్మాత డీఎస్ఎస్ శ్రీనివాసరావు, రచయిత గిరిధర్ కామేష్, ఆర్కే స్టడీ సెంటర్ అధినేత పులప రామకృష్ణ, డీటీపీ వెంకట్, ప్రసాద్‌కు మిత్ర అభినందనలు తెలిపారు. గిరజాల సోమ రాజు నాయుడు, వెంకట రాజు పాల్గొన్నారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మధుర గాయని, భారతరత్న లతా మంగేష్కర్ జయంతిని జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై నట, గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



పిడింగొయ్యిలో మొక్కలు నాటుతున్న చందన నాగేశ్వర్, డాక్టర్ పద్మలత

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత ఆధ్వర్యంలో గురువారం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో సుమారు 200 కానుగ, వేప మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సమాజం, పర్యావరణం విషయంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. డాక్టర్ పద్మలత సొంత నిధులతో మొక్కలు నాటడాన్ని కొనియాడారు. డాక్టర్ పద్మలత మాట్లాడుతూ ప్రజలు మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రూప్ చంద్, మాజీ ఎంపీపీ రేలంగి సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కందిరెల్లి సత్తిబాబు, సచివాలయం కన్వీనర్ పడాల వీరరాఘవ రెడ్డి, తీగిరెడ్డి శ్రీనివాస్, రేలంగి శ్రీనివాస్, గుత్తుల వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బూడిద శరత్ కుమార్, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గిరజాల బాబు, గొల్లపల్లి సత్యనారాయణ



ఎస్కేఆర్‌లో గుర్రం జాషువా జయంతి నిర్వహిస్తున్న అధ్యాపకులు

కంబాలచెరువు: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని గురువారం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత ఆచార్యులు, విద్యావిశారద డాక్టర్ అద్దేపల్లి సుగుణ హాజరై జాషువా జీవిత విశేషాలను, ఆయన జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, తెలుగు సాహిత్యంలో జాషువా రచనలకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షత వహించారు.

కడియం: తన రచనల ద్వారా తెలుగు భాషకు పరిపూర్ణతను కలిగించిన మహాకవి గుర్రం జాషువా అని కడియం మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ పేర్కొన్నారు. వేమగిరి బుద్ధవిహార్‌లో యార్లగడ్డ జగదీశ్వరరావు నేతృత్వంలో జాషువా జయంతి నిర్వహించారు.

కడియం: జనులంతా ఒక కుటుంబం, జగమంతా ఒక నిలయం అన్న నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని గురువారం కడియం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తెలుగు విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా జాషువా చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, కవి డాక్టర్ నీలకంఠరావు, గ్రామపెద్దలు పూలమాలలు చేసి నివాళులర్పించారు. అనంతరం బాబు మాట్లాడుతూ జాషువా కలలుగన్న ప్రపంచాన్ని, కులరహిత భారతదేశాన్ని ఆకాంక్షించారు. జాషువాపై తాను రాసిన పద్యాలను డాక్టర్ నీలకంఠరావు ఆలపించారు. కార్యక్రమంలో దొడ్డ బుజ్జి, సందీప్, గ్రామ పెద్దలు సూరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు నైపుణ్య తరగతులు

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో గురువారం అసంఘటిత రంగ కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంఘం సమన్వయంతో నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించనున్నామన్నారు. అనంతరం 15 మంది కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయిస్ సమావేశం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం జరిగింది. దీనికి యూనియన్ నాయకుడు వి.ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు, యూనియన్ నాయకులు పి.స్వామిబాబు, పరమేశ్వరి, సాయి, సుబ్బారావు హాజరయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.హెప్సీబా, పి.రవికుమార్, బి.భాస్కరరావు, ఎ.రవికుమార్, వీవీ.శ్రీనివాసరావును నియమించారు.

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకమని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ పిలుపు నిచ్చారు. భగత్ సింగ్ జయంతిని ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కంబాలచెరువు: స్థానిక ధర్మంచర కమ్యునిటీ ఫంక్షన్ హాలులో ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీకేటీడబ్ల్యూఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2023 ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గొప్పిశెట్టి బంగార్రాజు గురువారం తెలిపారు. దీనికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఒంటిద్దు స్వామినాయుడు, విశ్రాంత ఆర్జేడీ దేవలంక బూరయ్య హాజరయ్యారన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరుకాపు కులస్తుల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారందరూ ఏపీకేపటీడబ్ల్యూఏగా ఏర్పడ్డామన్నారు.

ఆన్‌లైన్ మోసం

కంబాలచెరువు: స్థానిక ఆదెమ్మదిబ్బకు చెందిన కె.రత్నకుమారి బ్యాంకు ఖాతాలో రూ.42 వేలు మాయమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఈ నెల 18న రత్నకుమారికి ఒక వ్యక్తి ఫోన్ చేసి మీకు అమ్మఒడి పడలేదు కదా, వివరాలు చెప్పాలని అడిగాడు. దీంతో ఆమె ఆధార్, పాన్‌కార్డు వంటి వివరాలన్నీ చెప్పింది. తర్వాత కొద్ది సమయానికి ఆమె ఖాతాలో సొమ్ము మాయమైంది.

స్వామినాథన్‌కు నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి కేంద్ర పొగాకు పరిశోధన కేంద్రం(సీటీఆర్ఐ)శాస్త్రవేత్తలు గురువారం సంతాపం తెలిపారు. ఆయన 50 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐని సందర్శించారన్నారు. ఆ జ్ఞాపకాలను డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తదితరులు గుర్తు చేసుకున్నారు.